క్లుప్తంగా

ఘనంగా ఎల్లమ్మ బోనాలు



ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్ గ్రామంలో ఆదివారం ఎల్లమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ బీరం శ్రీలత రామకృష్ణారెడ్డి మాట్లాడారు. సమాజంలోని ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బీరం రజనీకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ వీసం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చైల్డ్‌రైట్స్ సదస్సుకు హౌజుబుజుర్గు సర్పంచ్



ఆత్మకూరు : నేడు (సోమవారం) హైదరాబాద్‌లో జరగనున్న నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ సదస్సుకు మండలంలోని హౌజు బుజుర్గు సర్పంచ్ ఎస్కే.రబియా బీ హుస్సేన్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఆమె విలేకరులకు ఈ విషయాన్ని వెల్లడించారు. సదస్సుకు తనను ఎంపిక చేసినందుకు పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

కుంకుమేశ్వర ఆలయానికి స్టూల్స్ బహూకరణ



పరకాల : పట్టణంలోని శ్రీకుంకుమేశ్వర స్వామి ఆలయానికి పట్టణానికి చెందిన గోవిందు కుమార్ దంపతులు ఆదివారం 5 కూర్చునే స్టూళ్లను బహూకరించారు. ఈ మేరకు వారు స్టూళ్లను ఆలయ కమిటీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు చేతుల మీదుగా సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గందె వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఆలయానికి వచ్చే వృద్ధులకు స్టూళ్లు ఉపయోగపడతాయని చెప్పారు.

'ఎమ్మెల్సీ కవితపై సంజయ్ వ్యాఖ్యలు సరికాదు'

నడికూడ : ఎమ్మెల్సీ కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వ్యాఖ్యలు చేయడం సరికాదని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బండి సంజయ్ వ్యాఖ్యలను ఆయన ఖండించారు. సంజయ్ రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత రాజకీయ విలువలు పడిపోయాయని ఆందోళన వెలిబుచ్చారు. మహిళలపై గౌరవం లేని వ్యక్తి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా ఉండడం బాధారమని పేర్కొన్నారు. మహిళా ఎమ్మెల్సీ మీద ఆరోపణలు వచ్చినంత మాత్రాన తప్పుడు వ్యాఖ్యలు చేసి పైశాచిక ఆనందం పొందడం దుర్మార్గమని తెలిపారు. నిజనిర్ధారణ జరగకుండానే వ్యాఖ్యలు చేయడం నైతిక విలువల్లేనితనానికి నిదర్శనమన్నారు. సంజయ్‌పై వైఖరి ఏంటో బీజేపీ అధిష్టానం చెప్పాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 13న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. ఆర్టీఓ ఆఫీస్, గణేష్‌నగర్, రహమత్ నగర్, శేషాద్రి హిల్స్, 4వ బెటాలియన్, టీచర్స్ కాలనీ, మంగలమ్మకుంట, లెనిన్‌నగర్, వసంతపూర్, దూపకుంట ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు మజ్జిగ పంపిణీ

హన్మకొండ: ఎండ వేడి, వడదెబ్బ నుంచి ఉపశమనం పొందేందుకు టీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు మజ్జిగ పంపిణీ చేశారు. వరంగల్ -1 డిపోలో ఉద్యోగులకు మజ్జిగ ప్యాకెట్లను డిపో మేనేజర్ పి.శ్రీనివాస్ రావు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా ఉద్యోగులకు మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ టి.సంతోష్, ఎంసీ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి వధూవరులకు 'తోడు నీడ'

కాజీపేట అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లా తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వధూవరుల పరిచయ వేదికను 'తోడు నీడ' పేరిట హనుమకొండ హంటర్‌రోడ్డులోని బీసీ నేత హాస్టల్‌లో ఆదివారం నిర్వహించారు. కులస్తుల్లో రెండవ వివాహం కొరకు ఎదురుచూసే వారి కోసం వేదికను ఏర్పాటు చేసినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు కోడం రవిప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మ్యారేజ్ బ్యూరో కన్వీనర్, జిల్లా కోశాధికారి లకుం నవీన్ రాజకుమార్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధే లక్ష్యం

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్

ఐనవోలు : మహిళల అభివృద్ధే బీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన లక్ష్యమని బీఆర్‌ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ తెలిపారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఎంపీపీ మార్నేని మధుమతి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రమేష్ హాజరై ముందుగా మండలంలో వివిధ శాఖల్లో పని చేస్తున్న మహిళా ఉద్యోగులను, సిబ్బందిని, ప్రజాప్రతినిధులను శాలువాతో సత్కరించారు. అరూరి గట్టుమల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలో సంక్రాంతి సంబురాల పేరిట మహిళలకు నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో ప్రతిభ కనబర్చి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన 265 మంది మహిళలకు కుక్కర్, డిష్ సెట్, డబ్బాలను బహుమతులుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ మాట్లాడారు. మహిళలకు ఏజీఎఫ్ కూడా అండగా ఉంటుందని తెలిపారు. జీఓ నంబర్ 58, 59 ద్వారా మంజూరైన పట్టాలను ఇద్దరు లబ్ధిదారులకు, బ్యాంక్ లింకేజీ ద్వారా మంజూరైన రూ.23.1 కోట్ల చెక్కును మహిళా సంఘాల ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, రైతుబంధు జిల్లా కన్వీనర్ లలిత యాదవ్, సెర్ప్ ప్రాజెక్ట్ మేనేజర్ రవీందర్‌రావు, జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీనివాస్, డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాస్ కుమార్, తహసీల్దార్ రాజేష్, ఏఓ కవిత, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ కిరణ్మయి పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా పార్టీ

పరకాల : కార్యకర్తలకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. కార్యకర్త దామ కుమారస్వామి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కును హనుమకొండలోని తన నివాసంలో ఆయన అందజేసి మాట్లాడారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చింతిరెడ్డి మధుసూధన్‌రెడ్డి, నాయకులు నేతాని శ్రీనివాస్‌రెడ్డి, బిల్లా రమణారెడ్డి, గొర్రె రాజు, దామ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



ఆత్మకూరు : ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. మండలంలోని చౌళ్లపెల్లిలో నిర్వహించిన హనుమాన్, గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో ఆయన పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. భగవంతుని ఆశీస్సులతో ప్రజలు సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ కంచ రవికుమార్, ఎంపీటీసీ బొమ్మగాని భాగ్య, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ

ఆత్మకూరు : మండల కేంద్రానికి చెందిన రేవూరి పాపిరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమదంలో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. పాపిరెడ్డి కుటుంబాన్ని ఓదార్చారు. తొలుత పాపిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే ధర్మారెడ్డి వెంట రెడ్ క్రాస్ చైర్మన్ నిమ్మగడ్డ వెంకన్న, డైరెక్టర్ దుంపల బుచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు వంగాల భగవాన్‌రెడ్డి, బాషబోయిన సాగర్, రేవూరి జయపాల్‌రెడ్డి తదితరులున్నారు.

ఉత్సవాలను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

వరంగల్: ఈనెల 10నుంచి 31వరకు జరగనున్న అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల ఉత్సవాలను విజయవంతం చేయాలని వరంగల్ లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ ఎం.అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. 'వినియోగదారుల హక్కులు - బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్' వాల్ పోస్టర్లను పోచమ్మమైదాన్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వినియోగదారుల మండలి జాతీయ కార్యదర్శి సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ ఏప్రిల్ 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా బంగారు ఆభరణాలపై హాల్ మార్కింగ్‌తో పాటు, ప్రతీ ఆభరణంపై తప్పనిసరిగా హెచ్‌యూఐడీ నంబర్ ఉండాలని కేంద్ర వినియోగదారుల మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసిందని గుర్తుచేశారు. ఈ నిబంధనలు అమలయ్యేలా లీగల్ మెట్రాలజీ శాఖ పర్యవేక్షణ ఉండాలని వినియోగదారుల మండలి ప్రతినిధులు అసిస్టెంట్ కంట్రోలర్ అన్నారు. కార్యక్రమంలో సీసీఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్, మండలి రాష్ట్ర కమిటీ సంయుక్త కార్యదర్శులు చిలువేరు ప్రవీణ్, నల్లా రాజేందర్ పాల్గొన్నారు.

రేపటి ధర్నాను విజయవంతం చేయండి

కమలాపూర్ : ఈనెల 14న వరంగల్‌లోని ఎన్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని హెచ్82 యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలవేని రవి కోరారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ శాఖ ఉద్యోగులు, ఆర్టిజన్లకు పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని వెంటనే విడుదల చేయాలని, ఇతర 29 డిమాండ్లను పరిష్కరించాలని పలుమార్లు యాజమాన్యాన్ని కోరినా పట్టించుకోలేదని చెప్పారు. ఆర్టిజన్ కార్మికులకు ×రూరల్ పర్సనల్ పే×ను బేసిక్‌లో కలిపాక 50 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని, లేదంటే సింగిల్ మస్టర్ స్కేల్‌ను ఆర్టిజన్లకు కూడా అమలు చేయాలని, ఆర్టిజన్లకు ఏపీ ఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, కన్వర్షన్ ద్వారా డిపార్ట్‌మెంట్ పోస్టులు ఇవ్వాలని, అన్ని రకాల సెలవులు ఇవ్వడంతోపాటు అన్ని రకాల మెడికల్ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన ధర్నాలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అసంఘటిత కార్మికులుగా గుర్తించాలి



నూతన కమిటీ ప్రతినిధులు

ఖిలా వరంగల్: వరంగల్ ప్లంబింగ్, శానిటరీ వర్కర్లను అసంఘటిత కార్మికులుగా గుర్తించాలని వరంగల్ జిల్లా ప్లంబింగ్, శానిటరీ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు సోల రవి, వద్దె యుగేందర్ కోరారు. వరంగల్ శివనగర్‌లోని పద్మశాలి కమ్యూనిటీ హాల్‌లో వరంగల్ జిల్లా ప్లంబింగ్, శానిటరీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి బొల్ల రాజ్‌కుమార్ అధ్యక్షతన వర్ష శానిటరీ స్టోర్స్ బిల్లా రమేష్ సౌజన్యంతో సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లంబర్లకు ఈఎస్ఐ, పీఎఫ్, బీమా వంటి సౌకర్యాలు కల్పించాలని, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని, 50ఏళ్లు పైబడిన వారికి పింఛన్ అందజేయాలని కోరారు. అధునాతన శిక్షణ ఇచ్చి గుర్తింపు పత్రం ఇవ్వాలని సూచించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో బండారి సదానందం, మాలోతు బాలరాజు, వల్లకొండ సమ్మయ్య, ముత్తినేని శ్రీనివాస్, వేల్పుల ప్రసాద్, జన్ను అశోక్, సుంకల రవి, చిట్టిమల్ల రమేష్, రాగూర్ హరినాథ్ సింగ్, సిలివేరు ధనుంజయ్య, బాస్కుల దయాకర్, ఎనుగుతల సాంబయ్య, గనిపాక ప్రభాకర్, మంద దయాకర్, గాదె రవిందర్, మామిడాల రాజన్న, మంద బాబు, గనిపాక కొమురయ్య పాల్గొన్నారు.

కార్మిక భవనం నిర్మించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆరెల్లి కృష్ణ

ఖిలా వరంగల్: ఆజంజాహి మిల్లు వర్కర్స్ యూనియన్ బిల్డింగ్ స్థలంలో కార్మిక భవనాన్ని నిర్మించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి ఆరెల్లి కృష్ణ డిమాండ్ చేశారు. ఖిలా వరంగల్ మధ్యకోటలోని ఏకశిల చిల్డ్రన్‌పార్కులో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు గుంగుల దయాకర్, నున్నా అప్పారావు అధ్యక్షతన భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్‌టీయూ రెండవ నగర మహాసభ ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా కృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ 44 కార్మిక చట్టాలను కుదించి భారత కార్మిక వర్గానికి ద్రోహం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వ శాఖలో పనిచేస్తున్న డైలీవేజ్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని చెప్పి హామీని అమలు చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులందరికి నెలకు రూ.20వేల వేతనం ఇవ్వాలని, పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. సమావేశంలో ఏఐకేఎంఎస్ నేత బాల రాజు, ఏలియా రాజు, ఎంఏ ఖాన్, ప్రభాకర్, పుష్ప, ఇనుముల కృష్ణ, ప్రభాకర్, సదానందం, సాంబయ్య, విమల తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతుకు తీవ్రగాయాలు

పరకాల : రోడ్డు ప్రమాదంలో రైతు తీవ్ర గాయాలపాలైన ఘటన పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా.. మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన రైతు మూత రాజలింగం తన టీవీఎస్ చాంప్ ద్విచక్ర వాహనంపై వస్తుండగా పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద కొత్తగా నిర్మిస్తున్న జంక్షన్ మూలమలుపు వద్ద టాటా ఏస్ వాహనం ఢీకొంది. ఈ ఘటనలో రాజలింగం గాయాలపాలు కాగా స్థానికులు ఆయన్ను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. జంక్షన్ల వద్ద రోడ్డు వెడల్పు చేయకపోవడం వల్లే తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తరుణ్‌చుగ్‌కు సన్మానం

హన్మకొండ: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్‌ను బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ హనుమకొండలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద స్వాగతం పలికి ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరామారావు, నాయకులు అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బంది కలగకుండా చూడాలి

కాజీపేట: ఫాతిమా ఉత్సవాలను తిలకించడానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని ఏసీపీ శ్రీనివాస్ సూచించారు. ఫాతిమా మాత ఉత్సవాలను పురస్కరించుకొని కాజీపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో పోలీస్ సిబ్బందికి ఆదివారం డ్యూటీలను కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల్లో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ పనిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్యంగా లేకుంటే పార్కు స్థలాలు కబ్జా




సమావేశంలో ప్లాట్ల యజమానులు

హసన్‌పర్తి: ప్లాట్ల యజమానులు ఐక్యంగా లేకుంటే వెంచర్‌కు సంబంధించిన పార్కు స్థలాలు కబ్జాకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని సురభి ఎంక్లేవ్ అసోసియేషన్ అభిప్రాయ పడింది. అసోసియేషన్ సమావేశాన్ని ఎంక్లేవ్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు సిద్దూరి స్వామిరావు అధ్యక్షతన జరిగిన పలు అంశాలపై చర్చించారు. కొంతమంది రియల్టర్లు ఇప్పటికే పార్కు స్థలాలను చదును చేశారని అన్నారు. ఎంక్లేవ్‌లో విద్యుత్ స్తంభాలు నివాస గృహాలకు అనుమతి తీసుకోవాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు అన్నమనేని అప్పారావు, ప్రధాన కార్యదర్శి పుల్లూరి వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ శ్రీధర్‌రావు, ఆర్గనైజర్ ప్రవీణ్‌కుమార్, కోశాధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

కాజీపేట : కాజీపేట పట్టణ ప్రదేశ్ గంగపుత్ర (బెస్త) సంఘం ప్రధాన కార్యదర్శిగా పాక ఓంప్రకాష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం ప్రధాన కార్యాలయంలో ఆదివారం జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఓంప్రకాష్‌ను సభ్యులు ఘనంగా సన్మానించారు. అలాగే ఈనెలాఖరున పదవీ విరమణ చేయనున్న అనుమల శ్రీనివాస్‌ను సత్కరించారు. కార్యక్రమంలో పాక వేదప్రకాష్, శ్రీనివాస్, కె.రఘు, శంకర్, నర్సయ్య, డోలి గోపాల్, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అందించాలి



హన్మకొండ: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ సూచించారు. హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో సుబేదారిలోని ఐవీవై ఇంటర్ నేషనల్ స్కూల్ వార్షికోత్సవం శనివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా చీఫ్‌విప్ మాట్లాడుతూ చిన్ననాటి నుంచే విద్యార్థులకు సామాజిక పరిస్థితులు, మానవ విలువలు వంటి వాటిపై అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం విద్యార్థులకు చీఫ్‌విప్ పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐవీవై ఇంటర్ నేషనల్ స్కూల్ చైర్మన్ మహేష్ పసుల, డైరెక్టర్ సుహాస్ నీలం, ప్రిన్సిపాల్ సమంత పాల్గొన్నారు.

హామీల అమలులో కేసీఆర్ విఫలం

- టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ఎల్కతుర్తి : ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సీఎం కేసీఆర్ విఫలమయ్యారని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పర్లపెల్లి రవీందర్ విమర్శించారు. మండల కేంద్రంలో 'గడప గడపకు టీడీపీ' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ఆ పార్టీ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి రవీందర్ ముఖ్యతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి ఎన్నికల అనంతరం విస్మరించారని మండిపడ్డారు. టీడీపీ హయాంలోనే సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ఉమ్మడి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసినట్టు తెలిపారు. రాష్ట్రానికి ఐటీ రంగంలో గుర్తింపు తీసుకొచ్చినట్టు చెప్పారు. సీఎంగా ఎన్టీఆర్ పేదలకు రూ.2లకే కిలో బియ్యం అందజేశారని గుర్తు చేశారు. ఆడపిల్లకు సమాన హక్కులు కల్పించామన్నారు. పటేల్ పట్వారి వ్యవస్థను రద్దు చేసినట్టు తెలిపారు. సీఎంగా చంద్రబాబు నాయుడు 10 సార్లు డీఎస్సీ నిర్వహించి లక్షా 45 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక గడచిన తొమ్మిదేళ్లలో సీఎం కేసీఆర్ ఫీజు బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ధ్వజమెత్తారు. ఉద్యోగ ఖాళీల భర్తీ, నిరుద్యోగ భృతి అమలు, తదితర అన్ని హామీలను అమలు చేయకుండా సీఎం కేసీఆర్ మోసపూరిత పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేసి పార్టీకి పూర్వ వైభవం కల్పించాలని సూచించారు. రాబోయో ఎన్నికల్లో హుస్నాబాద్ నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగరేయడానికి సైనికుల్లా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మత్ర శ్రీనివాస్, మండల ఇన్‌చార్జ్ నసూర్, సీనియర్ నాయకులు తోకల శ్రీనివాస్, సోరుపాక రాజు, అయిలయ్య, బండారి బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజయ్య వేధింపులు సరికాదు



నవ్యను పరామర్శిస్తున్న కొటిల్‌రెడ్డి

ధర్మసాగర్ : ధర్మసాగర్ మండలంలోని జానకీపురం సర్పంచ్ కురుసపల్లి నవ్యను స్థానిక ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య లైంగికంగా వేధించడం సరికాదని టీఎస్ వైఎస్సార్‌టీపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మారం కొటిల్‌రెడ్డి, జనగామ జిల్లా అధ్యక్షుడు గొరబోయిన సమ్మయ్య, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సంగాల ఇర్మియా విమర్శించారు. ఈ సందర్భంగా మండలంలోని జానకీపురం గ్రామంలో సర్పంచ్ నవ్యను పార్టీ శ్రేణులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల పట్ల దురుసుగా ప్రవర్తిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పార్టీ తరఫున నవ్యకు మద్దతుగా నిలబడుతామని ప్రకటించారు. తనకు జరిగిన అవమానాన్ని నవ్య ధైర్యంగా ముందుకు వచ్చి చెప్పడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఊరడి శ్రీనివాస్, ఐటీ వింగ్ అధ్యక్షుడు మేడ ప్రశాంత్, నెమలిపురి రఘు, మోహన్, నంగునూరి రాజు, కొట్టె అనిల్, కొలిపాక అనిల్, కల్లెపు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నాటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

ధర్మసాగర్ : మండలంలోని నారాయణగిరి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 1984–85 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకుంటూ సంబరాలు చేసుకున్నారు. వారికి విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులైన పాలకుర్తి మధుసూదన్ రావు, వల్లపురెడ్డి జనార్ధన్‌రెడ్డి, శామల శ్రీనివాస్‌రెడ్డి, రమాజ్యోతికృష్ణలను ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థుల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలకు మల్టీకలర్ ప్రింటర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులకు పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ఎస్ రాజ్‌గోపాల్‌రెడ్డి, స్టాఫ్ సెక్రటరీ బి శ్రీదేవి కృతజ్ఞతలు తెలిపారు.

వినియోగదారుల చట్టంపై అవగాహన అవసరం

హన్మకొండ: వినియోగదారుల చట్టంపై అవగాహన కలిగి ఉండాలని కన్జ్యూమర్ కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్ అన్నారు. హనుమకొండలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వినియోగదారుల సవరణ చట్టం 2019 ద్వారా వినియోగదారుల రక్షణకు ప్రాధాన్యం ఇచ్చినట్లు చెప్పారు. వినియోగదారుడు నష్టపోతే పరిహారం పొందవచ్చని అన్నారు. ఈ సందర్భంగా 'స్వచ్ఛమైన శక్తి పరివర్తన' (క్లీన్ ఎనర్జీ ట్రాన్సిషన్) పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సీసీఐ హనుమకొండ జిల్లా గౌరవ అధ్యక్షులు తోకల సుధాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రాగి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పత్తిపాక తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

చైతన్యయాత్రను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

న్యూశాయంపేట: ఈనెల 17న నిర్వహించనున్న జనయాత్ర చైతన్య బస్సు యాత్రను విజయవంతం చేయాలని సీపీఎం హనుమకొండ జిల్లా కన్వీనర్ బొట్ల చక్రపాణి పిలుపునిచ్చారు. హనుమకొండలోని పార్టీ ఆఫీస్‌లో వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాత్ర సందర్భంగా హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సభకు ముఖ్యఅతిథిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య, సీతారాములు, తదితరులు పాల్గొంటారని తెలిపారు. అధిక సంఖ్యలో నాయకులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వాసుదేవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చుక్కయ్య, ఉప్పలయ్య, వీరన్న, రమేష్, వెంకట్, రాములు, సంపత్, లింగయ్య పాల్గొన్నారు.

గౌడ కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలి



గణపతి గౌడ్‌ను పరామర్శిస్తున్న నాయకులు

హన్మకొండ: తాటిచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి తీవ్ర గాయాలపాలై వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతున్న భూపాలపల్లి జిల్లా నేరేడుపల్లికి చెందిన గంట గణపతి గౌడ్‌కు ప్రభుత్వం మెరుగైన చికిత్స అందించాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణు గోపాల్ గౌడ్ కోరారు. గౌడ కులస్తుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. ఈమేరకు గణపతిగౌడ్‌ను బీసీ సంక్షేమ సంఘం, సర్వాయి పాపన్న గౌడ సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సర్వాయి పాపన్న గౌడ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ శ్రీపతి గోపి గౌడ్ మాట్లాడుతూ ప్రమాదాల నివారణ నివారణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, తాటి చెట్టు ఎక్కే యంత్రాలను గీత కార్మికులకు ఉచితంగా పంపిణీ చేయాలని, హైబ్రిడ్ పొట్టి తాటి చెట్లను అన్ని గీత సొసైటీలకు ఉచితంగా అందించాలని కోరారు. కార్యక్రమంలో తాళ్లపల్లి రమేష్ గౌడ్, ఏరుకొండ రమేష్, శ్రీపతి ప్రశాంత్ గౌడ్, పొన్నం రాకేష్ గౌడ్, వేముల రాజయ్య, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, పొన్నం రాంబాబు, వేముల బాలకృష్ణ గౌడ్, పంజాల రాజకుమార్, పొన్నం లక్ష్మణ్ పాల్గొన్నారు.